సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం । 20 । జూలై । 2024



సోమశిలలో 9.791 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో శుక్రవారానికి 9.791 టీఎంసీలున్నాయి. ఏడు క్యూసెక్కుల వంతున వరద చేరుతోంది. దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.76,900
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.6,869
3శాతం జీఎస్టీతో	రూ.7,075
నవర (8గ్రా)	రూ.56,600

గరిష్టం/కనిష్టం

32.4 /28.0

వాతావరణం

గాలిలో తేమ 76 శాతంగా శుక్రవారం నమోదైంది. జిల్లాలో అక్కడక్కడా శనివారం జల్లులు పడే అవకాశం ఉందని వాతావరణ అధికారులు తెలిపారు.



కిటకిటలాడుతున్న స్వర్ణాల ఘాట్



దర్గాలో బారులు తీరిన భక్తులు



రొట్టె తీసుకునేందుకు పోటీ పడుతున్న భక్తులు

మదినిండా భక్తిభావంతో..

- మూడోరోజు బారాషహీద్ దర్గాకు పోటెత్తిన జనం
- దర్శనం కోసం గంటల కొద్దీ నిరీక్షణ
- తెల్లవారుజాము నుంచే కిటకిటలాడిన స్వర్ణాల ఘాట్

నెల్లూరు(బారకాసు): నెల్లూరులోని బారాషహీద్ దర్గాలో రొట్టెల పండగ వేడుకగా జరుగుతోంది. మూడోరోజైన శుక్రవారం కూడా భక్తులు పోటెత్తారు. దీంతో స్వర్ణాల తీరం భక్తజన సంద్రమైంది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులతో నెల్లూరు నగరంలోని అన్ని రోడ్లు నిండిపోయాయి. కోర్కెలతో వచ్చిన భక్తులు వరాల రొట్టెలు పట్టుకునేందుకు రద్దీ కారణంగా నిరీక్షణ చేయాల్సి వచ్చింది. అంతకుముందు గురువారం రాత్రి గంధమహోత్సవాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. దీనిని వేలాదిమంది వీక్షించారు.

స్వర్ణాల ఘాట్లు కిటకిట

గంధమహోత్సవం ముగియడంతో భక్తుల తాకిడి పెరిగింది. ఈ ఉత్సవం అనంతరం వరాల రొట్టెలను పట్టుకుంటే కోరికలు ఫలిస్తాయనే నమ్మకంతో గురువారం రాత్రి నుంచి స్వర్ణాల చెరువు జనసంద్రంగా మారి భక్తులతో కిటకిటలాడింది. దర్గాలో సమాధులను దర్శించుకునే భక్తులు గంటల కొద్దీ క్యూలైన్లలో నిరీక్షించాల్సి వచ్చింది. ప్రాంగణంలో భక్తులకు అన్నదానం చేశారు. జిల్లా వైద్యారోగ్యశాఖతోపాటు పలు కార్పొరేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించాయి.

న్యూస్‌రీల్

ఇన్‌చార్జి వీసీ బాధ్యతల స్వీకరణ



విజయభాస్కరరావును సన్మానిస్తున్న నారాయణగౌడ్

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) ఇన్‌చార్జి వీసీగా విజయభాస్కరరావు బాధ్యతలు స్వీకరించారు. తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీలో భౌతిక శాస్త్ర విభాగపు సీనియర్ ఆచార్యులుగా ఉన్న విజయ భాస్కరరావును వీఎస్‌యూ ఇన్‌చార్జిగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో శుక్రవారం వెంకటాచలం మండలం కాకుటూరు వద్దనున్న వీఎస్‌యూకు చేరుకుని బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఎస్‌యూ అభివృద్ధికి అందరి సహకారంతో తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. విజయభాస్కరరావును అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

- వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు స్వీకరించిన విజయ భాస్కరరావును ఏపీ బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షులు డాక్టర్ పర్చూరు నారాయణ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సన్మానించారు.

జీజీహెచ్‌లో ఇన్‌ఫెక్షన్ కమిటీ తనిఖీలు



జీజీహెచ్‌లో తనిఖీలు చేస్తున్న డాక్టర్ నీరద బృందం

నెల్లూరు(అర్బన్): విజయవాడ నుంచి వచ్చిన రాష్ట్ర వైద్యశాఖ హాస్పిటల్ ఇన్‌ఫెక్షన్ కమిటీ టీమ్ (డాక్టర్ నీరద బృందం) శుక్రవారం నెల్లూరు సర్వజన ఆస్పత్రిలో తనిఖీలు నిర్వహించింది. క్యాజువాలిటీని, ఓపీ సేవల రూములను పరిశీలించింది. అనంతరం గైనకాలజీ విభాగంలోని అన్ని వార్డులను పరిశీలించింది. మందులు నిల్వ చేసే స్థలం, సెలైన్లు, ఇంజెక్షన్లను కంటామినేట్ (కలుషితం) కాకుండా ఉండేలా తగు జాగ్రత్తలు పాటిస్తున్నారా? అని తనిఖీలు చేసింది. డాక్టర్లతో చర్చించింది. ఈ సందర్భంగా టీమ్ ఇన్‌చార్జి డాక్టర్ నీరద మాట్లాడుతూ రోగులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అందులో భాగంగా డాక్టర్లు, సిబ్బంది పరిశుభ్రత విషయంలో హైజినిక్ ఎంతమేరకు పాటించారో పరిశీలించి తగు నివేదికను ప్రభుత్వానికి పంపుతామన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి డాక్టర్ కళారాణి, గైనకాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ గీతాలక్ష్మి, డాక్టర్ సుశీల్, నర్సింగ్ సూపరింటెండెంట్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల తహసీల్దార్లు సొంత జిల్లాలకు బదిలీ

నెల్లూరు(దర్గామిట్ట): సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎన్నికల విధుల నిమిత్తం రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి బదిలీపై జిల్లాకు వచ్చిన తహసీల్దార్లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నెల్లూరు జిల్లాకు ఒంగోలు, బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచి తహసీల్దార్లు వచ్చారు. ప్రభుత్వ ఉత్తర్వులతో వారు తమ సొంత జిల్లాలకు బదిలీపై వెళ్లనున్నారు.

పొగాకు సాగు పరిమితి పెంపు

2024-25 సీజన్‌కు సాగు పరిమితిని నిర్ణయించిన బోర్డు

- నెల్లూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో 105.27 మి.కేజీలు పండించేందుకు అనుమతి
- ఎస్ఎల్ఎస్ పరిధిలో బ్యారన్‌కు 36.50 నుంచి 42.75 క్వింటాళ్లకు
- ఎస్‌బీఎస్ పరిధిలో 35.50 నుంచి 41.75 క్వింటాళ్లకు ఉత్పత్తి పరిమితి పెంపు



కందుకూరు: 2024-25 పంట సీజన్‌కు సంబంధించి పొగాకు పంట ఉత్పత్తి పరిమితిని పొగాకు బోర్డు భారీగా పెంచింది. ఈ మేరకు శుక్రవారం జరిగిన బోర్డు మీటింగ్‌లో నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలో ఈ ఏడాది 162 మిలియన్ కేజీల పొగాకు పండించేందుకు అనుమతి ఇవ్వగా, అదే ప్రకాశం రీజియన్ పరిధిలోని నెల్లూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో 105.27 మిలియన్ కేజీలుగా నిర్ణయించింది. 2023-24 పంట సీజన్‌కు 89.9 మి.కేజీలు ఉన్న ఈ పరిమితిని ప్రస్తుత సీజన్‌కు భారీగా పెంచినట్లు అయింది. అంటే దాదాపు 15.37 మిలియన్ కేజీల పొగాకును అధికంగా పండించేందుకు అనుమతిచ్చినట్లు అయింది. పొగాకు పంట పరిమితిని పెంచుతూ బోర్డు తీసుకున్న నిర్ణయంపై రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రకాశం రీజియన్‌లో 105.27 మిలియన్ కేజీలకు అనుమతి

పొగాకు బోర్డు రాష్ట్రంలో 2024-25 పంట సీజన్‌కు మొత్తం 162 మిలియన్ కేజీల పొగాకు ఉత్పత్తికి అనుమతించగా దీనిలో ఎస్‌బీఎస్ (సదరన్ బ్లాక్ సాయిల్) పరిధిలో 49.26 మి.కేజీలు, ఎస్ఎల్ఎస్ (సదరన్ లైట్ సాయిల్) పరిధిలో 56.01 మి.కేజీలు, ఎస్ఎల్ఎస్ పరిధిలో 58.25 మి.కేజీలు, ఎన్‌బీఎస్ పరిధిలో 3.48 మి.కేజీల వరకు పంట పరిమితిని పెంచింది. దీనిలో భాగంగా ప్రకాశం రీజియన్ పరిధిలోని నెల్లూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో 105.27 మిలియన్ కేజీల పొగాకు పండించవచ్చు. పొగాకు బోర్డు ప్రకాశం రీజియన్ పరిధిలో మొత్తం 11వేలం కేంద్రాలున్నాయి. వీటిలో నెల్లూరు జిల్లాలో కందుకూరు-1, కందుకూరు-2, కలిగిరి, డీసీ పల్లి వేలం కేంద్రాలు ఉండగా, ప్రకాశం జిల్లా పరిధిలో ఒంగోలు-1, ఒంగోలు-2, కొండెపి, కనిగిరి, టంగుటూరు, వెల్లంపల్లి, పొదిలి వేలం కేంద్రాలున్నాయి. వీటిలో దక్షిణ ప్రాంత తేలిక నేలల పరిధిలో (ఎస్ఎల్ఎస్) 6 వేలం కేంద్రాలు, సదరన్ బ్లాక్ సాయిల్(ఎస్‌బీఎస్) పరిధిలో 5 వేలం కేంద్రాలున్నాయి. అంటే 11 వేలం కేంద్రాల పరిధిలో ఈ సీజన్‌కు 105.27 మిలియన్ కేజీలు పండించుకోవచ్చు. అదే గత ఏడాది ఈ పరిమితి 89.9 మిలియన్ కేజీలుగా ఉంది. అదే సందర్భంలో బ్యారన్ పరిమితిని కూడా బోర్డు నిర్ణయించింది. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది బ్యారన్ పరిమితిని కూడా భారీగానే పెంచారు. గతేడాది ఇది ఎస్ఎల్ఎస్ పరిధిలో బ్యారన్‌కు 36.50 క్వింటాళ్లు ఉంటే అది ఇప్పుడు 42.75 క్వింటాళ్లకు, ఎస్‌బీఎస్ పరిధిలో 35.50 క్వింటాళ్ల నుంచి 41.75 క్వింటాళ్ల ఉత్పత్తిని అమ్ముకునేలా బోర్డు నిర్ణయం తీసుకుంది. అంటే బ్యారన్‌కు దాదాపు 6 క్వింటాళ్ల వరకు పెంచినట్లు అయింది.

అనుమతి మేరకే సాగు చేయాలి

2024-25 పంట సీజన్‌కు పొగాకు పంట పరిమితిని పెంచుతూ బోర్డు నిర్ణయం తీసుకుంది. ఎస్ఎల్ఎస్, ఎస్‌బీఎస్ పరిధిలో దాదాపు 105 మిలియన్ కేజీలు పండించేందుకు బోర్డు అనుమతిచ్చింది. అయితే పొగాకు మార్కెట్ ఎప్పుడూ ఒకే విధంగా ఉండదు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఒడిదుడుకులుంటాయి. రైతులు ఈ ఏడాది లాభాలను చూసి వచ్చే పంట సీజన్‌కు భారీగా పొగాకు సాగు చేయకుండా పంట నియంత్రణ పాటించాలి. బోర్డు అనుమతించిన మేరకే పొగాకు పండిస్తే మార్కెట్‌లో ధరలు ఆశాజనకంగా ఉంటాయి.

– ఎం.లక్ష్మణరావు, ఆర్ఎం, ఎస్ఎల్ఎస్

భారీగా పెరుగుతున్న పంట సాగు

రెండేళ్ల నుంచి అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ దృష్ట్యా వేలంలో రికార్డులు ధరలు వస్తుండడంతో పొగాకు పంట సాగు భారీగా పెరుగుతోంది. ఈ ఏడాది వచ్చిన ఉత్పత్తులే ఇందుకు నిదర్శనం. పొగాకు బోర్డు విధించిన పరిమితిని దాటి భారీగా పొగాకును రైతులు పండిస్తున్నారు. 2023-24 పంట సీజన్‌కు నెల్లూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో దాదాపు 89 మిలియన్ కేజీల పొగాకు అమ్ముకునేందుకు బోర్డు అనుమతి ఉంటే ఇప్పటికే అధికారిక అమ్మకాలు పూర్తయ్యాయి. అయితే బోర్డు అధికారుల అంచనా ప్రకారం ఈ రెండు జిల్లాలో ఈ ఏడాది 139 మిలియన్ కేజీల వరకు రైతులు పండించినట్లు అంచనా వేస్తున్నారు. అంటే బోర్డు పరిమితిని దాటి దాదాపు 50 మిలియన్ కేజీల పొగాకు ఉత్పత్తులు అధికంగా పండించారు. ఈ నేపథ్యంలోనే బోర్డు పొగాకు సాగు పరిమితిని పెంచాలని రైతులు డిమాండ్ చేస్తూ వస్తున్నారు. అయితే రైతుల పండిస్తున్న స్థాయిలో కాకపోయినా ఈ ఏడాది భారీగానే పంట పరిమితిని పెంచుతూ బోర్డు నిర్ణయం తీసుకుందని భావిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో కేజీ పొగాకు రూ.365ల వరకు పలుకుతోంది. వేలం చివరి రోజుల్లో ఈ ధర ఇంకా పెరుగుతుందనే అంచనాలు ఉన్నాయి. మరోపక్క అనధికారిక పొగాకు అమ్మకాలపై విధించే పెనాల్టీ ఉంటుందా? ఉండదా? అనే దానిపై బోర్డు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. దీనిపై కూడా మరో రెండు రోజుల్లో నిర్ణయం వస్తుందని బోర్డు అధికారులు చెబుతున్నారు.

నారాయణ విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయాలి



ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

నెల్లూరు (టౌన్): విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతూ వారి ప్రాణాలు తీస్తున్న నారాయణ విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మస్తాన్ షరీఫ్, పీడీఎస్‌యూ నాయకుడు షారుఖ్, ఏఐఎస్‌బీ నాయకుడు వీవీఎస్ చైతన్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం నగరంలోని రమేష్‌రెడ్డినగర్‌లో నారాయణ స్కూల్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి జయధర్‌ను ఉపాధ్యాయులు కొట్టి అవమానించడం వల్లే ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి సత్వర న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సంఘటన జరిగి 48 గంటలు అయినా జిల్లా విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టకపోవడం దారుణమన్నారు. ఈ విషయమై పాఠశాల యాజమాన్యాన్ని నిలదీయగా జరిగిన తప్పు వాస్తవమేనని, ఆ ఉపాధ్యాయులను తొలగించినట్లు చెప్పారన్నారు. అనంతరం జిల్లా విద్యాశాఖాధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు శివవర్మ, ఆశీర్వాదం, అక్షయ్, జాను, వసీం, నవీన్, అన్వర్‌మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రవాణాకు రాజమార్గం

మన్నేరు వాగు నుంచి భారీగా ఇసుక తరలింపు

- సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన గ్రామస్తులు
- నామమాత్రపు తనిఖీలకే పరిమితమైన అధికారులు



రాళ్లపాడు వద్ద మన్నేరు వాగులో ఇసుక నిల్వలు

కందుకూరు: ఇసుక రవాణా వ్యవహారంలో ప్రస్తుత ప్రభుత్వం చెబుతున్న మాటలకు క్షేత్ర స్థాయిలో జరుగుతున్న వ్యవహారాలకు సంబంధం ఉండటం లేదు. ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ నియోజకవర్గంలో జరుగుతున్న ఇసుక రవాణా వ్యవహారం. ఒక పక్క ఉచిత ఇసుక అని ప్రకటనలిస్తూనే మరోపక్క ఆ పార్టీ నాయకులు భారీగా ఇసుక అక్రమ రవాణాకు తెరలేపుతున్నారు. గుడ్లూరు మండలంలోని రాళ్లపాడు గ్రామ సమీపంలోని మన్నేరు వాగులో జరుగుతున్న అక్రమ ఇసుక రవాణాను తాజాగా గ్రామస్తులు బయటపెట్టారు. కొందరు టీడీపీ నాయకులు భారీ ఎత్తున ఇసుక తవ్వకాలు జరుపుతున్నారని, ఇసుకను తీసుకెళ్లేందుకు ఏకంగా వాగులో గ్రావెల్‌రోడ్డును వేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే క్షేత్ర స్థాయి అధికారులు నామమాత్రపు తనిఖీలకే పరిమితమై నిస్సహాయులుగా మారిపోతున్నారు.

రాళ్లపాడు గ్రామ మన్నేరులో భారీగా మేలు రకం ఇసుక ఉంది. ఇక్కడ దాదాపు 30 అడుగుల లోతు వరకు నిల్వలు ఉంటాయని అంచనా. దీంతో ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ నాయకుల కళ్లు ఈ ఇసుక క్వారీలపై పడ్డాయి. అధికారంలోకి వచ్చిందే తడవుగా గుడ్లూరు మండలానికి చెందిన కొందరు కీలక నేతలు ఇసుకను తరలించే పనిలో పడ్డారు. దీని కోసం వాగులో టిప్పర్‌లు, ట్రాక్టర్లు వెళ్లేందుకు వీలుగా గ్రావెల్ రోడ్డును నిర్మించారు. అక్కడ జేసీబీని ఏర్పాటు చేసి యథేచ్ఛగా ఇసుక అక్రమ తవ్వకాలు చేపడుతున్నారు. పెద్ద ఎత్తున టిప్పర్ల ద్వారా బయట ప్రాంతాలకు తరలిస్తున్నారు. దీంతో ఆందోళన చెందిన గ్రామస్తులు ఇదేమని ప్రశ్నించినా సమాధానం చెప్పేవారే కరువయ్యారు. అసలు గ్రామానికి సంబంధం లేని వ్యక్తులు, కనీసం పంచాయతీ సర్పంచ్‌ను కూడా సంప్రదించకుండా ఎలా ఇసుక తరలిస్తారని ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం గ్రామంలో ఇసుక తవ్వకాలకు ఎటువంటి అనుమతులు లేవని, అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయాన్ని గ్రామ సర్పంచ్‌తో పాటు మరికొందరు గ్రామస్తులు సబ్‌కలెక్టర్ విద్యాధరిని కలిసి వినతిపత్రం అందజేశారు. తమ గ్రామంలో జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలను ఆపాలని వేడుకున్నారు. దీనిపై స్పందించిన సబ్‌కలెక్టర్ విద్యాధరి వెంటనే గుడ్లూరు మండల తహసీల్దార్‌కు ఫోన్ చేసి క్షేత్ర స్థాయిలో రీచ్‌ను పరిశీలించాలని, అక్కడ ఉన్న వాహనాలను సీజ్ చేయాలంటూ గ్రామస్తుల ముందే ఆదేశాలు జారీ చేశారు. సబ్‌కలెక్టర్ ఆదేశాలతో ఇసుక రీచ్‌కు వద్దకు వెళ్లిన తహసీల్దార్ రీచ్‌ని చూసి వచ్చారే గానీ అక్కడ ఉన్న వాహనాలను సీజ్ చేయలేదు. దీంతో ఈ వ్యవహారం నియోజకవర్గంలో పెద్ద చర్చనీయాంశంగా మారింది.

పాలూరులో రేయింబవళ్లు

అదే కోవలో కందుకూరు మండలంలోని పాలూరు ఇసుక రీచ్ నుంచి అక్రమ ఇసుక తవ్వకాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. రాత్రి, పగలు తేడా లేకుండా భారీ ఎత్తున ట్రాక్టర్లతో కందుకూరు పట్టణంలోకి ఇసుకను తరలిస్తున్నారు. గ్రామానికి చెందిన దాదాపు 10 ట్రాక్టర్‌లు రోజంతా ఇసుక తోలే పనిలోనే ఉంటున్నాయని, ఇది బహిరంగ రహస్యమే అయినా పోలీస్ అధికారులు గానీ, రెవెన్యూ అధికారులు గాని అటువైపు కన్నెత్తి చూడడం లేదని ఆయా గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఇసుకను లోడ్ చేసేందుకు ఏర్పాటు చేసిన జేసీబీ

క్లుప్తంగా

ఆరోగ్య కేంద్రంలో పోస్టుల భర్తీకి చర్యలు

• డీసీహెచ్ఎస్ రమేష్‌నాథ్



రోగులతో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్

ఉదయగిరి: మండల కేంద్రమైన ఉదయగిరిలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో చిన్నపిల్లల వైద్యులు, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్ పోస్టులు ఖాళీలున్నాయని, వీటిని భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని డీసీహెచ్ఎస్ డాక్టర్ రమేష్‌నాథ్ తెలిపారు. ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యుల పనితీరు, అందుబాటులో ఉన్న మందులు, రోగులకు అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి దూరంగా ఉన్న ఈ ఆరోగ్య కేంద్రంలో అన్ని రకాల వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. రక్తపరీక్షలతోపాటు స్కానింగ్, ఎక్స్‌రే, ఈసీజీ లాంటి పరీక్షలు చేస్తున్నట్లు చెప్పారు. చిన్నపిల్లల డాక్టర్ అవసరమని ఉన్నతాధికారులకు నివేదించి ఈ పోస్టును త్వరగా భర్తీ చేసే ప్రయత్నం చేస్తామన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు.

అమ్మ పేరుతో మొక్క

• ప్రధానమంత్రి పిలుపుతో జిల్లాలో 4.57 లక్షల మొక్కలు నాటేందుకు కృషి
• జిల్లా అటవీశాఖాధికారి చంద్రశేఖర్



మాట్లాడుతున్న డీఎఫ్ఓ చంద్రశేఖర్

నెల్లూరు(అర్బన్): పర్యావరణాన్ని, ప్రకృతిని కాపాడేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన అమ్మ పేరుతో ఒక మొక్క అనే నినాద కార్యక్రమాన్ని జిల్లాలో వేగంగా అమలు చేస్తున్నామని జిల్లా అటవీశాఖాధికారి (టెరిటోరియల్) చంద్రశేఖర్ తెలిపారు. నెల్లూరు వేదాయపాలెంలోని అటవీశాఖ కార్యాలయంలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. అటవీ ప్రాంతంలో ఖాళీగా ఉన్న ప్రదేశాల్లో ఇప్పటికే 20 వేల మొక్కలు నాటామన్నారు. అయితే ప్రభుత్వం రోడ్లు, ఇతర ప్రాజెక్టుల కోసం కొంత అటవీశాఖ భూమిని నిబంధనల మేరకు తీసుకుని ప్రత్యామ్నాయంగా తమ శాఖకు ఇతర చోట్ల అటవీ ప్రాంతాలకు ఆనుకుని భూమిని కేటాయించిందన్నారు. అలాంటి చోట్లు కలిపి మొత్తం 412 హెక్టార్లలో కొత్తగా మొక్కలు నాటుతున్నామన్నారు. మొత్తం 4.57 లక్షల మొక్కలను నాటుతామన్నామన్నారు. జిల్లాలో 9 నర్సరీల్లో 9 లక్షల మొక్కలు సిద్ధంగా ఉన్నాయన్నారు. అటవీ ప్రాంతాన్ని కాపాడుకునేందుకు, ఎడారి ప్రాంతం కాకుండా చూసేందుకు, వన్యప్రాణులకు అనువుగా పచ్చటి వాతావరణం కల్పించేందుకు మొక్కలు నాటి పరిరక్షించబోతున్నామన్నారు. 2,800 హెక్టార్లలో గతం నుంచి నాటిన చెట్లను పరిరక్షించేలా వర్షాకాలమంతా ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రజలు ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ ద్వారా ఉచితంగా మొక్కలు పొందవచ్చన్నారు. ప్రతి పౌరుడు తమ ఇంట్లో ఒక మొక్క నాటి దానిని సంరక్షించాలన్నారు. తద్వారా భూతాపాన్ని తగ్గించడమే కాకుండా సకాలంలో వర్షాలు కురిసేందుకు ఎంతోమేలు చేసిన వారమవుతామన్నారు.


కండలేరులో 6.286 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 6.286 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. లోలెవల్ కాలువకు 15 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అమాత్యా.. అంతా గొప్పలేనా..!



తాగునీటి కేంద్రంలో చెరకు మెషీన్



దర్గా వద్ద ఇలా..



ముక్కు మూసుకుని వెళ్తున్న భక్తులు



భోజనాల వద్ద ఇదీ పరిస్థితి

• రొట్టెల పండగకు అంతంతమాత్రంగా ఏర్పాట్లు
• దర్గా వద్ద అపరిశుభ్ర వాతావరణం
• ఇబ్బందులు పడుతున్న భక్తులు

నెల్లూరు(క్రైమ్): 'బారాషహీద్ దర్గాలో రొట్టెల పండగను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నాం. నిత్యం అధికారులతో సమీక్షలు చేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూస్తున్నాం. పారిశుద్ధ్య చర్యలు అద్భుతంగా ఉన్నాయి' అంటూ రాష్ట్ర మంత్రులు, టీడీపీకి చెందిన ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పదేపదే ప్రకటనలు గుప్పిస్తున్నారు. అయితే వాస్తవ పరిస్థితి మాత్రం అందుకు పూర్తి విరుద్ధంగా ఉంది.

ఇక్కడిలా..

భక్తులకు రూ.లక్షలు వెచ్చించి దర్గా ఆవరణలోని పలు ప్రాంతాల్లో తాగునీటి కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే ఆ ప్రాంతాల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. ఆయా కేంద్రాల్లో కొందరు వ్యాపారులు అనధికారికంగా దుకాణాలు నిర్వహిస్తున్నారు. నగరపాలక సంస్థ తాగునీరు కేంద్రంలో చెరకు జ్యూస్ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. జ్యూస్ తీయగా వచ్చిన వ్యర్థాలను అక్కడే పడవేస్తుండడంతో దుర్గంధం వెదజల్లుతోంది.

తోపులాట

దర్గాకు విచ్చేసే భక్తుల కోసం అధికారులు ఉచిత భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. ఆవరణలో ట్రాక్టర్ ట్రాలీలో భోజనం తీసుకొచ్చి అందులో నుంచే భక్తులకు అందజేయసాగారు. శుక్రవారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో అక్కడ తోపులాట జరిగింది. దీంతో కొందరు భోజనం తీసుకోకుండానే వెనుదిరిగారు. భోజన సౌకర్యం ఏర్పాటు చేసిన వారు ఒకరిద్దరిని నియమించి క్యూలైన్లు ఏర్పాటు చేసి ఉంటే తోపులాటలు తప్పేవని పలువురు భక్తులు వాపోయారు. కానీ అధికారులు ఆ దిశగా ఆలోచన చేయలేదు.

జాగ్రత్తలు తీసుకోకుండా..


దర్గాలో రూ.లక్షలు వెచ్చించి విద్యుత్ సరఫరాకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు చేశారు. అయితే సరైన జాగ్రత్తలు తీసుకోలేదు. విద్యుత్ వైర్లు ఇష్టారాజ్యంగా వదిలివేయడం, ఫ్యూజుల వద్ద వైర్లు కిందకు వేలాడుతుండడంతో ప్రమాదం పొంచి ఉంది. దర్గా ఆవరణలోని ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలోని కరెంట్‌పోల్‌కు ఉన్న ఫ్యూజ్ బాక్స్ తెరిచి వైర్లు బయటకు వేలాడుతూ ఉన్నాయి. నగరపాలక సంస్థ కేంద్రం వద్ద వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. ఏదైనా అనుకోని ఘటన జరిగితే మూల్యం చెల్లించుకోక తప్పని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

దారుణంగా..

దర్గా ఆవరణలో అపరిశుభ్ర వాతావరణం, పొంచి ఉన్న ప్రమాదాలతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన దర్గాలో భక్తులు టెంకాయలు కొడుతున్నారు. అందులోని నీటిని పైపు ద్వారా తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కాలువలోకి పంపుతున్నారు. అయితే అక్కడి నుంచి నీరు వెళ్లే మార్గం లేకపోవడంతో ఆ ప్రాంతంలో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. కాలువను ఆనుకుని భక్తుల క్యూలైన్ ఏర్పాటు చేశారు. కాలువలోని నీరు పారుదల లేక దుర్వాసన వెదజల్లుతుండడంతో భక్తులు తీవ్ర ఇబ్బంది పడుతూ ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. అదే క్యూలైన్లలో టెంకాయలు కొడుతుండడం, వ్యర్థాలను అందులోనే వేస్తుండడంతో మరింత అధ్వానంగా తయారైంది. వర్షాల కారణంగా ఉండేందుకు సరైన స్థలం లేకపోవడంతో తడుస్తూనే భక్తులు దర్గాను దర్శించుకుంటున్నారు.



భక్తులు వెళ్లే క్యూలైన్ పక్కన టెంకాయలు, ప్లాస్టిక్ కవర్లు



ప్రమాదకరంగా విద్యుత్‌వైర్లు

దర్గా వద్ద అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్

• సీఎం వర్చువల్ సమావేశానికి మంత్రులు, ఎమ్మెల్యేల రాక
• వారి వాహనాల కారణంగా భక్తులకు ఇబ్బందులు
• అంబులెన్స్ వెళ్లేందుకు అష్టకష్టాలు



వాహనాల మధ్యలో నుంచి క్యూలైన్ల వద్దకు వెళ్తున్న భక్తులను అడ్డుకుంటున్న పోలీసులు



దర్గా వద్ద పోలీసుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్న భక్తులు

నెల్లూరు(క్రైమ్): రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారుల వాహనాలు శుక్రవారం పెద్ద సంఖ్యలో దర్గా ఆవరణలో పార్కింగ్ చేయడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గంధమహోత్సవం జరిగిన మరుసటిరోజు భక్తులు పెద్ద సంఖ్యలో దర్గాను దర్శించుకోవడం ఆనవాయితీ. శుక్రవారం భక్తులు పోటెత్తారు. సీఎం చంద్రబాబు నాయుడు వర్చువల్ విధానంలో మాట్లాడే కార్యక్రమం ఏర్పాటు చేయగా మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కావ్య కృష్ణారెడ్డి, టీడీపీ నాయకుడు అబ్దుల్ అజీజ్, కలెక్టర్, ఎస్పీ తదితర అధికారులు తమ వాహనాల్లో దర్గా వద్దకు వచ్చారు. కంట్రోల్‌రూమ్ వద్ద వాహనాలను పార్కింగ్ చేసి ముఖ్యమంత్రి కార్యక్రమంలో పాల్గొన్నారు. రొట్టెలు మార్చుకునేందుకు స్వర్ణాలఘాట్‌కు, క్యూలైన్ల వద్దకు అటువైపుగా వెళ్లే భక్తులను పోలీసులు అడుగడుగునా అడ్డుకోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాహనాలను దాటుకుని రావడం కష్టతరంగా మారింది.

చికిత్స నిమిత్తం తీసుకెళ్లేందుకు..

దర్గాకు వచ్చిన ఓ వ్యక్తి అనారోగ్యానికి గురికాగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ప్రజాప్రతినిధుల వాహనాల కారణంగా అంబులెన్స్ వెళ్లే మార్గం లేకుండా పోయింది. అష్టకష్టాలు పడి బయటకు వెళ్లారు.

తీరు మారని పోలీసులు

రొట్టెల పండగను కవర్ చేసే మీడియా ప్రతినిధులు, విధులు నిర్వహించేందుకు ఇతర శాఖల సిబ్బందికి సంబంధిత అధికారులు వెహికల్ పాస్‌లను మంజూరు చేశారు. అవి ఉంటే దర్గాలోకి అనుమతించాలని ఉన్నతాధికారులు పోలీసు సిబ్బందిని ఆదేశించారు. అయితే కొందరు పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. పాస్‌లు చూపించినా పట్టించుకోకుండా ఇబ్బందులకు గురిచేశారు. దర్గాను దర్శించుకునేందుకు భక్తులకు దర్గా ఉత్సవ కమిటీ, రెవెన్యూ, పోలీసు అధికారులు వీఐపీ పాస్‌లు మంజూరు చేశారు. ఒక్కో దానిపై నలుగురు వెళ్లే అవకాశం ఉంది. అయితే పాస్‌లు చెల్లవంటూ భక్తులను పంపివేయడంతో వారు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

రాయగడ: చోరీ కేసులో నెల్లూరు జిల్లాకు చెందిన ముగ్గురు వ్యక్తులను ఒడిశా రాష్ట్రం చందిలి పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. రెండు మోటార్‌బైక్‌లు, మూడు సెల్‌ఫోన్లు, రూ.23 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. చందిలి పోలీస్‌స్టేషన్ పరిధిలో అమలాభట్ట గ్రామంలో నివాసం ఉంటున్న ఏకామ్ర మహారణ అనే వ్యక్తి టీపీఎస్‌డీఓఎల్ సంస్థలో (విద్యుత్ విభాగం) పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా తన బైక్‌ను జేకేపూర్‌లోని వేంకటేశ్వర ఆలయం సమీపంలో ఈనెల 9వ తేదీన పార్కింగ్ చేసి, పక్కనే ఉన్న ఫ్యూజ్ కాల్ కార్యాలయానికి వెళ్లాడు. పని ముగించుకొని తిరిగి ఇంటికి వెళ్లేందుకు బయటకు రాగా బైక్ కనిపించలేదు. దీంతో వెంటనే చందిలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి నిందితులను పట్టుకున్నారు. నెల్లూరు జిల్లా బోగోలు మండలానికి బాణాల జకరే, పేటల నవీన్, బాణాల రవిగా గుర్తించారు. నిందితులు అంతర్రాష్ట్ర దొంగల ముఠాకు చెందిన వారిగా ఎస్‌డీపీఓ సేనాపతి వెల్లడించారు.

మద్యం తాగేసి పాఠశాలలో పడిపోయి..

• దుత్తలూరు మండలంలో ఘటన



పాఠశాలలో పడిపోయిన సుందరం

దుత్తలూరు: ఓ వ్యక్తి అధిక మోతాదులో మద్యం తాగేసి ప్రభుత్వ పాఠశాలలోకి వెళ్లి పడిపోయిన ఘటన మండలంలోని ఏరుకొల్లు ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. జిల్లాలోని ముత్తుకూరుకు చెందిన సుందరం అనే వ్యక్తి పదేళ్ల నుంచి బండకిందపల్లిలోని పొలాల వద్ద కాపలాగా ఉంటున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి అధిక మోతాదులో మద్యం తాగి మండలంలోని ఏరుకొల్లు ఉన్నత పాఠశాల వద్దకు వచ్చాడు. తాళాలు వేసి ఉండగా గేటు దాటి లోపలికి ప్రవేశించి విద్యార్థులు కూర్చునే బల్లల మధ్య స్పృహ లేకుండా పడిపోయాడు. శుక్రవారం ఉదయం వచ్చిన విద్యార్థులు సుందరాన్ని చూసి భయాందోళనకు గురై గ్రామస్తులకు, ఉపాధ్యాయులకు తెలియజేశారు. గ్రామస్తులు 108కు సమాచారం అందించారు. అపస్మారక స్థితిలో ఉన్న సుందరాన్ని పోలీసులు అంబులెన్స్‌లో వింజమూరుకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. ఈ ఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

రాష్ట్రస్థాయి పాటలు, నృత్య పోటీలు రేపు

నెల్లూరు(బృందావనం): బయ్యా వెంకటరమణయ్య 82వ జయంతిని పురస్కరించుకుని నగరంలోని పురమందిరంలో ఆదివారం కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పాటలు, నృత్య పోటీలు నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు తెలిపారు. దీనికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను శుక్రవారం పురమందిరం ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళా రంగానికి విశిష్ట సేవలందించిన న్యూరాజ్యలక్ష్మిహాల్, శుభమస్తు షాపింగ్‌మాల్ వ్యవస్థాపకుడు బయ్యా వెంకటరమణయ్యను స్మరిస్తూ ఆ సంస్థల అధినేతలు బయ్యా శ్రీనివాసులు, బయ్యా వెంకటరవికుమార్‌ల సౌజన్యంతో కార్యక్రమాన్ని ఆరోజు ఉదయం 10 నుంచి నిర్వహిస్తున్నట్లు వివరించారు. విజేతలకు ప్రోత్సాహకంగా షీల్డ్‌లు, నగదు బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. కూచిపూడి నృత్య గురువు డి.సాంబశివరావు ఆధ్వర్యంలో 150 మంది కళాకారులతో ప్రదర్శనలు, శ్రీబాలాజీ ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు సుబ్బారావు వివరించారు. సమావేశంలో అమానుల్లాఖాన్, గోవర్ధన్, ఎస్.రమణయ్య, మల్లికార్జున్ పాల్గొన్నారు.

సర్వేపల్లి కాలువలో మృతదేహం

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు మినీబైపాస్ రోడ్డులోని సర్వేపల్లి కాలువలో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు చూసి వీఆర్వో సాయివినీత్‌కు సమాచారం అందించారు. ఆయన బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏఎస్సై పీఎస్ రాజు ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహకారంతో మృతదేహాన్ని బయటకు తీసుకొచ్చారు. మృతుడి శరీరంపై బట్టలు లేవు. మృతదేహం కుళ్లి తీవ్ర దుర్గంధం వెదజల్లుతుండడంతోపాటు, చర్మం ఊడిపోయి ఉంది. అతను చనిపోయి రెండు, మూడురోజులై ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి ఏఎస్సై కేసు నమోదు చేశారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి : రూ.65
సన్నవి : రూ.50
పండ్లు : రూ.35

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) :	135
లేయర్ (లైవ్) :	110
బ్రాయిలర్ చికెన్ :	242
బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	268
లేయర్ చికెన్ :	187

